
సాక్షి
ఒడిశా
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,36,403లు, బంగారం 1.42 గ్రాములు, వెండి 1గ్రాము వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సందడిగా సాగర్ విజే

- 8లో.



సొగసు చూడతరామా..!

- 8లో.

నేటి నుంచే అధ్యక్షా..!



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ సునీల్ బన్సాల్, కమిషనర్ సౌమేంద్రకుమార్, ఉన్నతాధికారులు



- శాసనసభ బడ్జెట్ సమావేశాలకు సర్వం సిద్ధం
- గవర్నర్ గణేషీలాల్ ప్రసంగంతో కార్యకలాపాలు ప్రారంభం
- మూడంచెల భద్రత వ్యవస్థ విధించిన పోలీసు యంత్రాంగం
- ఏర్పాట్లపై డీజీపీ సునీల్ బన్సాల్ సమీక్ష

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండు దశల్లో జరగనున్న సమావేశాలు గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ ప్రసంగంతో కొనసాగనున్నాయి. ఈ మేరకు అసెంబ్లీకి గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కమిషనరేట్ పోలీసులు ఈ కార్యకలాపాలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. బందోబస్తు ఏర్పాట్లను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సునీల్‌కుమార్ బన్సాల్, శాంతి భద్రతల ఏడీజీ రాధాకృష్ణ శర్మ, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ సంజీవ్ పండా, పోలీస్ కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్‌సింగ్ మూడంచెల భద్రతా ఏర్పాట్లను సోమవారం ప్రత్యక్షంగా సమీక్షించారు. అసెంబ్లీలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. సమీక్ష అనంతరం డీజీపీ బన్సాల్ మీడియాతో మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నామని, ఈ వ్యవధిలో శాసనసభకు మూడంచెల భద్రత నిరవధికంగా కొనసాగుతుందని తెలిపారు.

30 ప్లాటూన్ల బలగాలు..

అసెంబ్లీ భవనం చుట్టూ 30 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. దీంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హై సెక్యూరిటీ జోన్‌లో ఇద్దరు డీసీపీలు, 10మంది అదనపు డీసీపీలు, 11మంది ఏసీపీలు ఉంటారని డీజీపీ ప్రకటించారు. లోపలి భద్రత వలయాన్ని స్పెషల్ బ్రాంచ్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుందన్నారు. కమిషనరేట్ పోలీసులు వెలుపలి రెండు భద్రతా వలయాలను నిర్వహిస్తాయని తెలిపారు. రెండు స్పెషల్ టాక్టికల్ యూనిట్లు, డాగ్ స్క్వాడ్‌లు, ఫైర్ సర్వీసెస్ సిబ్బంది 24 గంటలూ సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు పోలీసులు సజావుగా పని చేసేందుకు నగరంలో 5 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక లోయర్ పీఎంజీ స్క్వేర్ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంటుంది. నిరసనలు, ఆందోళనల నిర్వహణకు ఈ ప్రాంతం కేటాయించడంతో నిఘా గట్టిగా ఉంచడం విశేషం. అవాంఛనీయ సమస్యల నివారణకు అసెంబ్లీ భవనం చుట్టూ వాహనాలను దారి మళ్లిస్తారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

రెండు విడతల్లో సమావేశాలు..

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశాలు రెండు విడతల్లో నిర్వహిస్తారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కాగా, గవర్నర్ గణేషీలాల్ సభను ఉద్దేశించి తొలి ప్రసంగం చేస్తారు. దీంతో బడ్జెట్ సెషన్ ప్రారంభం అవుతుంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి నిరంజన్ పూజారి ఈనెల 24న రాష్ట్ర బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. సమావేశాల తొలి విడత మార్చి 1తో ముగిస్తారు. మలివిడత సమావేశాలు మార్చి 10 నుంచి ఆరంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి.

పటిష్ట భద్రత..

భద్రతా వ్యవస్థలో 30 ప్లటూన్ల పోలీసులు ఉంటారు. అలాగే మూడంచెల భద్రతా వ్యవస్థను అవలంబిస్తారు. 2 ప్లాటూన్ల స్పెషల్ ఆపరేషన్ గ్రూప్(ఎస్ఓజీ), రూఫ్ టాప్ సెక్యూరిటీ, క్విక్ రియాక్షన్ టీమ్‌లు ఉంటాయి. డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌ను కూడా రంగంలోకి దించుతున్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయమైన, శాంతి భద్రతల పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భద్రతా బలగాలు సిద్ధంగా ఉంటాయి. అసెంబ్లీ ప్రాంతంలో 144సెక్షన్ కొనసాగుతుంది. ఇద్దరు డీసీపీల నేతృత్వంలో 10మంది అదనపు డీసీపీలు, 11 మంది ఏసీపీలు, 13మంది ఐఐఏలు, 85మంది అధికారులు, 2000 మంది కానిస్టేబుళ్లను నియమించారు. దీంతో పాటు నిరసన స్థలంపై కూడా పోలీసులు నిఘా ఉంచుతారని డీజీపీ వివరించారు.

ప్రెస్ గ్యాలరీకి అనుమతి..




స్పీకర్ విక్రమ్ కేశరి అధ్యక్షతన సమావేశమైన అఖిలపక్షం సభ్యులు

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీలో మీడియా ప్రతినిధుల కోసం ప్రెస్ గ్యాలరీ, సాధారణ ప్రజల కోసం వీక్షకుల గ్యాలరీ మంగళవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని ఈ రెండు గ్యాలరీల్లో అనుబంధ వర్గాల ప్రవేశానికి అనుమతిస్తున్నట్లు శాసనసభ స్పీకర్ విక్రమ కేశరి అరూఖ్ తెలిపారు. సభా కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం తర్వాత సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా కోవిడ్ సంబంధిత ఆంక్షల కారణంగా మూసివేసిన ప్రెస్ గ్యాలరీ, వీక్షకుల గ్యాలరీ లను తాజా సమావేశాలు పురస్కరించుకుని తిరిగి తెరవనున్నట్లు వెల్లడించారు. మహమ్మారికి ముందు జరిగినట్లుగానే సభా కార్యక్రమాలను ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించగలరన్నారు. కోవిడ్ ప్రోటోకాల్స్ ప్రకారం నిర్ణీత దూరంతో ఎమ్మెల్యేల సిట్టింగ్ ఏర్పాటును సులభతరం చేయడానికి రెండు గ్యాలరీలు మూసివేశారు. ఆంక్షలను ఉపసంహరించుకున్న తర్వాత కూడా ప్రెస్ గ్యాలరీని మూసివేయడంపై ప్రతిపక్ష పార్టీలు, మీడియా వర్గాలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడం ప్రభుత్వానికి ప్రభావితం చేసినట్లు స్పష్టం అవుతోంది. అలాగే 14 అంశాల ఎజెండాపై అఖిలపక్ష సమావేశం జరిగిందని, అన్ని అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందని శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి నిరంజన్ పూజారి తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి సెంచూరియన్‌లో 'ఉత్కళ్ కృషి మేళా'



పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్రికెట్ మైదానంలో మంగళవారం నుంచి ఉత్కళ కృషి మేళా జరగనున్నట్లు వ్యవసాయ విద్యాలయం డీన్ డాక్టర్ ఎస్పీ నందా తెలిపారు. ఉత్కళ కృషి మేళా కృషి జాగరణ్, న్యూఢిల్లీ సంస్థ ఆధ్వర్యంలో 2 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునాతన యంత్రాలు, ఆధునిక సాగు పద్ధతులపై జరగనున్న సదస్సులో దాదాపు 2వేల మంది రైతులు, ఔత్సాహికులు పాల్గొనున్నట్లు ప్రకటించారు.

నాగుపాముల కలకలం



స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బంది బంధించిన నాగుపాములు

బరంపురం: నగర శివారు లుచ్చపడా రేడియో స్టేషన్ సమీపంలోని పద్మానగర్ 2వ లైన్‌లో నివసిస్తున్న సత్యనారాయణ సాబత్ ఇంటి పెరట్లో 2 నాగుపాములు చొరబడి కలకలం సృష్టించాయి. స్థానికుల సమాచారంతో బరంపురం అటవీశాఖ అధికారులు చేరుకొని స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థను రప్పించి, చాకచక్యంగా 2 సర్పాలను బంధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం లకాడి అటవీ ప్రాంతంలో 2 పాములను సురక్షితంగా విడిచిపెట్టారు.

ఉత్కళ విశ్వ విద్యాలయం వీసీగా స్వాయి



ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ స్వాయి

భువనేశ్వర్: బరంపురం విశ్వ విద్యాలయం ఒడియా విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ స్వాయి ఉత్కళ సంస్కృతి విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ అధికారిక ప్రకటన సోమవారం వెలువరించారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లు కొనసాగనున్నారు. బోధనా రంగంలో 31 ఏళ్ల విశేష అనుభవం గడించిన స్వాయి.. పది పుస్తకాలను రచించారు. ఇద్దరు డీలిట్, 15మందికి పీహెచ్‌డీ, 56మంది ఎం.ఫిల్ అభ్యర్థుల ఉత్తీర్ణతకు మార్గనిర్దేశం చేశారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

పర్లాకిమిడి: జిల్లా కేంద్రానికి సమీపంలోని బెత్తగుడ వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని తన హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించారు. సోమవారం తెల్లవారుజామున 4గంటలకు విద్యార్థిని ఉరి వేసుకున్నట్లు ప్రిన్సిపాల్ పీకే పండా విలేకర్లకు తెలిపారు. మృతురాలు సౌధామిని రైతో(15) స్వగ్రామం గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ అల్లడ పంచాయతీ. పర్లాకిమిడి ఆదర్శ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మధ్యాహ్నం వరకు పోస్టుమార్టం నివేదిక రాకపోవడంతో మృతికి గత కారణాలను పోలీసులు చెప్పలేకపోతున్నారు. అయితే కుమార్తె మరణవార్త విన్న వెంటనే విద్యాలయానికి చేరుకున్నప్పటికే మృతదేహాన్ని కిందకు దించినట్లు డేవిడ్ రైతో చెబుతున్నాడు. గిరిజన తెగకు చెందిన సౌధామిని.. చదువుతో పాటు అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉండేదని, ఉద్దేశపూర్వకంగానే పాఠశాల సిబ్బందే హతమార్చి ఉంటారని విద్యార్థిని మావయ్య అల్లడ గ్రామానికి చెందిన రోహకిమ్ రైతో ఆరోపించాడు. అయితే మృతురాలిని జేఎస్‌వీ ఉపాధ్యాయులు, లేదా హాస్టల్ సిబ్బంది ఇబ్బంది పెట్టారా? లేదా ఇంకేదైనా కారణం ఉందా అని పోలీసులు విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బీజేపీ వ్యూహాలు సిద్ధం..



రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం

భువనేశ్వర్: 16వ శాసనసభ 12వ సమావేశాలు పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ శాసనసభ సభ్యులు సమావేశమయ్యారు. రాష్ట్ర రాజధాని నగరంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్రశాఖ అధ్యక్షుడు సమీర్ మహంతి అధ్యక్షతన సోమవారం ఈ సమావేశం జరిగింది. రెండు విడతల్లో దీర్ఘకాలంగా జరగనున్న ఈ సమావేశంలో పార్టీ వ్యూహాత్మక వైఖరి ఈ సమావేశంలో ఖరారైనట్లు పేర్కొన్నారు. 21నుంచి సభలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, ఖాయిలా పడిన ఆరోగ్య వ్యవస్థ, దిగజారిన వ్యవసాయ రంగం, రైతుల సమస్యలు, అధోగతి పాలవుతున్న విద్యావ్యవస్థ, నిరుద్యోగ యువత సమస్యలు ప్రధాన శీర్షికలుగా తమ పార్టీ సభలో ప్రస్తావిస్తుందని ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ మాఝీ ప్రకటించారు. కేబినెట్ మంత్రిని బహిరంగంగా చంపడం రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భారీ అవినీతి, విద్యుత్ ధరల పెంపు, బియ్యం సమస్య, లోపించిన ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్యావిధానం వైఫల్యం, హాకీ ప్రపంచ కప్ అవినీతిని తెరపైకి తీసుకు వస్తామన్నారు. ప్రతి పంచాయతీలో ట్రోఫీ పర్యటన, వేడుకలకు ఖర్చు చేసిన సొమ్ము వివరాల లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు. అడవుల్లో రగులుతున్న మంటలు, వన్య ప్రాణుల వేట, మేక్ ఇన్ ఒడిశా వైఫల్యం వంటి అంశాలను బీజేపీ అసెంబ్లీలో ప్రస్తావిస్తుందని వివరించారు.

నేడు బీజేడీ ఎమ్మెల్యేల సమావేశం

అఖిలపక్షం నిర్వహించిన సమావేశాలకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బంశాల్, విపక్షనేత జయనారాయణ మిశ్రా, ప్రతిపక్ష చీఫ్ విప్ మోహన్ మాఝీ, రాష్ట్ర అధ్యక్షుడు సమీర్ మొహంతి, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని అధికార బిజూ జనతాదళ్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంగళ వారం సమావేశం కానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బీజేడీ సభ్యులు, శాసనసభ నాయకుడు నరసింగ మిశ్రా అధ్యక్షతన కాంగ్రెస్ సభ్యులు సమావేశం అవుతారు. బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాలు వ్యూహాత్మక కార్యాచరణ ఈ సమావేశంలో ఖరారు చేయడం ప్రధాన అంశంగా పేర్కొన్నారు.

తెలంగాణ పర్యటనకు గిరిజన యువత



ప్రయాణానికి సిద్ధమైన గిరిజన యువతీ, యవకులతో బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఎంవీ–3 గ్రామం వద్ద ఉన్న బీఎస్ఎఫ్ కేంద్రం నుంచి రెండో బెటాలియన్ తరుపున 20మంది యువతీ, యువకులు సోమవారం తెలంగాణ పర్యటనకు బయలుదేరారు. వీరంతా ఈనెల 21 నుంచి 27 వరుకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. గిరిజన యువతకు బాహ్య ప్రపంచాన్ని పరిచయం చేసేందుకే ఈ పర్యటనకు తీసుకు వెళ్తున్నట్లు బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్ కమాండెంట్ సంజయ్‌కుమార్ తెలిపారు. 15మంది యువకులు, 5గురు యువతులతో కూడిన ఈ బృందంలో వారికి సాయంతో ఐదుగురు జవాన్లు కూడా వెంట వెళ్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి ఖర్చులు బీఎస్ఎఫ్ భరించనుందని. పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని ఫిల్మ్‌సిటీ, గవర్నర్ భవన్ సందర్శన, చారిత్రక ప్రదేశాలు, టాలీవుడ్ నటీ, నటులను కలుసుకోవడం జరగనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిజన యువతను ప్రోత్సహించిన ఆయన.. బస్సును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ కామాండర్ సుభజాన్ మహాపాత్రొ, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 11న టికిరిలో రైల్ రోకో



రైల్ రోకో చేసేందుకు సిద్ధమైన టికిరి ప్రాంతవాసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి రైల్వే స్టేషన్‌లో మార్చి 11న రైల్ రోకో చేపట్టేందుకు టికిరి ప్రాంతవాసులు నిర్ణయించారు. ఈ మేరకు టికిరి శివమందిరం ప్రాంగణంలో వ్యాపార సంఘం, గ్రామ ప్రముఖులు, ప్రజా సంఘాలు సోమవారం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో తమ నిర్ణయాన్ని ప్రకటించారు. టికిరి రైల్వేస్టేషన్‌లో హౌరా–జగదల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కల్పించాలని గత కొన్నేళ్లుగా ఈప్రాంత వాసులు రైల్వే అధికారులను కోరుతున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో తమ నిరసనను తెలియజేసేందుకు రైలు రోకోను మార్గంగా ఎంచుకున్నారు. 2022 నవంబర్ 23న ఆందోళన చేసేందుకు సన్నద్ధం కాగా.. అప్రమత్తమైన రైల్వే అధికారులు టికిరి ఐఐసీ దేవమల్లిక్ సహకారంతో రైల్వే ఉన్నతాధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇచ్చిన గడువు పూర్తయినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో రైల్ రోకో ఖాయమని, దీనికి సంబంధించి ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నట్లు గ్రామానికి చెందిన సిమాంచల్ సాహు, ఎంకే షొడంగి, వినోద్ నాయక్, లవ్ సాహు, మనోజ్‌కుమార్ బెహరా తదితరులు ప్రకటించారు.

బైక్ చోరులు అరెస్ట్




పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

- 20 బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టిన పోలీసులు గత కొంతకాలంగా అపహరణకు గురవుతున్న బైక్ దొంగలను పట్టుకున్నారు. వారి నుంచి 20 బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై గంజాం ఎస్పీ బ్రజేష్‌కుమార్ రాయ్ అందించిన సమాచారం ప్రకారం ఆది, సోమవారాల్లో బరంపురం, గంజాం పరిధిలో ద్విచక్ర వాహనాల మాయమవుతున్నాయి. దీనిపై బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడంతో పాటు దొంగల ముఠాకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఖుర్దా జిల్లాకు చెందిన గొలమ్ హుస్సేన్‌ఖాన్, గంజాం జిల్లాకు చెందిన లిల్లు బెహరా, మధురా గ్రామానికి చెందిన ఉత్తమ్ నాయక్, సుకాంత్ నాయక్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, 20 బైక్ లను స్వాధీనం చేసుకున్నారు.

25 కిలోల గంజాయి పట్టివేత

బరంపురం నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 25 కిలోల గంజాయిని బుగడా స్టేషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఐఐసీ అధికారి బసంత్‌కుమార్ సెఠి తెలిపారు. కొందమాల్ జిల్లా నుంచి బుగడా మీదుగా బరంపురం నగరానికి బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మార్గం మధ్యలో రెక్కీ నిర్వహించామన్నారు. బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి 25కిలోల గంజాయి బస్తా పట్టుబడింది. దీంతో నిందుతుడిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఐఐసీ వివరించారు.



గంజాయితో పట్టుబడిన నిందితుడు



పోలీసుల అదుపులో నిందితులు

పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలే కీలకం

- చెత్త బళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే తారాప్రసాద్



జెండా ఊపి, వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు మమేకం కావాలని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి కోరారు. బొరిగుమ్మ సమితి కుమిలి పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త బండికి సోమవారం పూజలు చేసిన ఎమ్మెల్యే.. అనంతరం జెండీ ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్త బండితో ప్రతి ఇంటికీ వెళ్లి, వ్యర్థ పదార్థాలు, చెత్తను సేకరిస్తున్నారని, దీనివల్ల ఆయా పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అపరిశుభ్రత కారణంగానే అంటు వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మన గ్రామాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన చేతిలోనే ఉందని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా ప్రతి పంచాయతీలో వ్యర్థ పదార్థాలు, చెత్తను ప్రతి ఇంటి నుంచీ సేకరించేందుకు వాహనాలు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. ముందస్తుగా బొరిగుమ్మ సమితిలోని కమత, కుమిలి, బొడిగాం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యానికి వినియోగ పడేందుకు చెత్త బళ్లను అధికారులు కేటాయించడం ఆనందకరమన్నారు. బ్యాటరీతో నడిచే ఈ వాహనాల బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించినట్లు వివరించారు. కార్యక్రమంలో బీడీఓ ప్రణయరంజన్ బెహరా, జిల్లా పరిషత్ సభ్యులు పింకు శత్పతి, కమర సర్పంచ్ బాసంతి జానీ, మాలతీ జానీ, కుములి సర్పంచ్ పార్వతీ జానీ, సమితి సభ్యులు పద్మినీ జానీ బొడిగాం సర్పంచ్ కరుణ బొడొనాయక్, అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామనగుడలో వినతుల స్వీకరణ



వినతుల స్వీకరణలో త్రిపాఠి, కుహారో, రౌత్రాయ్ తదితరులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి కేంద్రంలో వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 26 ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. ఇందులో 18 వ్యక్తిగతమైనవిగా గుర్తించారు. వారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా ఈసారి జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ హాజరు కాకపోవడంతో నామమాత్రంగా ఫిర్యాదుల మాత్రమే వచ్చాయి. వచ్చిన వాటిని సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీడీ త్రిపాఠి ఆదేశించారు. ఈ సమావేశంలో సీడీఎంఓ లాల్‌మోహన్ రౌత్రాయ్, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి యజ్ఞసేని బెహరా, ఎస్‌డీపీఓ వికాష్ బెహురా, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మాదిన శ్రీకర్ ఎంపిక



మాదిన శ్రీకర్

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మాదిన శ్రీకర్ ఈ నెల 22వ తేదీ నుంచి బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. దీనిపై శ్రీకర్ తండ్రి మాదిన చిరంజీవులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో శ్రీకర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిపై జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, అశోక్, సీఈఓ సూరిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకర్ జాతీయస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

7 నుంచి ఓటీ డ్యూటీల బహిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మార్చి 7వ తేదీ నుంచి ఓటీ డ్యూటీలు బహిష్కరించనున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి, ఈయూ జోనల్ కార్యదర్శి టీకే మూర్తి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్‌లో నెలకొన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం రెండో డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత 17 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేస్తున్నా యాజమాన్య వైఖరిలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం రెండో డిపోలో సమస్యలు నెలకొన్నాయని, వీటి వలన కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక అక్రమ రవాణాతో సీజ్ చేసిన ట్రాక్టర్లు

మందస: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ వై.రవికుమార్ చెప్పారు. గౌడుగురంటి, తాళ్లగురంటి ప్రాంతంలోని మహేంద్రతనయ నది పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న ఈ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. పింపిడియా గ్రామానికి చెందిన తలగాన పాపారావు, బెల్లుపటియాకు చెందిన మడియా గోవర్ధనరావు, పాత్తంగిలోని దల్లి భాస్కరరావు, కొర్రాయిగేటు నర్సు రఘునాథ్, గొల్లలపాలేనికి చెందిన నర్సు హేమరాజులకు చెందిన ఈ ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. సోంపేట కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు శంబరపోలమాంబ ఐదో జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి ఐదో జాతర మంగళవారం జరగనుంది. ఈఓ వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలు ఏర్పాటు చేశారు. లడ్డూప్రసాదం, పులిహోరా ప్రసాదం తయారు చేయించారు. భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. సాలూరు సీఐ ధనంజయరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

సందడిగా సాగర్ విజే

భువనేశ్వర్: పవిత్ర మాఘ అమావాస్య పురస్కరించుకుని ఆలయ పరంపర మేరకు పూరీ జగన్నాథ మందిరంలో సాగర్ విజే ఉత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన జగన్నాథుని ఆజ్ఞామాల పొందిన తర్వాత నారాయణుడు(ఉత్సవమూర్తి) పల్లకిలో సాగర తీరానికి బయల్దేరాడు. 22మెట్లు గుండా సింహద్వారం నుంచి మేళతాళాలు, బాజా భజంత్రీల సందడి మధ్య నారాయణుని పల్లకి స్వర్గద్వార్ మీదుగా మహా దధి తీరానికి చేరింది. తీరంలో అర్చక వర్గం స్వామివారికి జలసేవ నిర్వహించింది. తిలకించిన భక్తులు తన్మయంలో మునిగి తేలారు.



సాగర తీరంలో జల సేకరణలో పండిత సమూహం



పల్లకిలో నారాయణునికి జలసేవ



భక్తులకు దర్శనమిస్తున్న నారాయణుడు

ముగిసిన మీనాజోల ఉత్సవాలు




మీనాజోలలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ కుహారో

రాయగడ: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రంగా గుర్తింపు పొందిన గుణుపూర్ సబ్ డివిజన్ లోని మీనాజోలలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిసాయి. గత 3రోజులుగా అత్యంత ఘనంగా జరిగిన ఈ ఉత్సవాలు, మీనకేశ్వరుని దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 2లక్షల మంది భక్తులు వచ్చారని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నిరంతరం అధికారులు పర్యవేక్షణతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో తెలిపారు. ఉత్సవాల ముగింపు సమయంలో త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన వంశధార, పాలోపపాలియా, చవులొధువా నదిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పుణ్యస్నానాలు ఆచరించారు.

దేవగిరిలో..

జిల్లాలోని చారిత్రక శైవక్షేత్రంగా పేరొందిన కల్యాణ సింగుపూర్ లోని దేవగిరిలో శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. భక్తులతో దేవగిరి కొండ సందడిగా కనిపిస్తోంది. రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 26తో ఇక్కడి ఉత్సవాలు ముగుస్తాయి.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాలింకేశ్వర మందిరంలో..

పట్టణంలో అతి ప్రసిద్ధి పొందిన పురాతనమైన పీహెచ్‌డీ కొండపై ఉన్న బాలింకేశ్వర మందిరంలో పూజలు, రుద్రాభిషేకాలు, అర్చనలు జరుగుతున్నాయి. గజపతి జిల్లా కవిసూర్యనగర్‌కు చెందిన వేదపండితుల పర్యవేక్షణలో శివ పంచాక్షరి, హోమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఇక్కడి ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్‌ఓబీ పనుల్లో పురోగతి

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ రైల్వేస్టేషన్ జట్నీ ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) నిర్మాణం పనులు పురోగతి దిశలో పుంజుకుంటున్నాయి. రైలుమార్గం ఇరువైపులా రాత్రింబవళ్లు రద్దీతో కిటకిటలాడే ప్రాంతాలకు ప్రమాదరహిత రహదారి సదుపాయం కల్పించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. వంతెనపై బౌ స్ట్రింగ్ గడ్డర్స్ పనులు చకాచకా సాగుతున్నాయి. జట్నీ వాసులకు మరికొద్ది రోజుల్లోనే ఈ వంతెన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.





తుది దశలో జట్నీ ఫ్లైఓవర్ పనులు (ఇన్‌సెట్లో) బౌ స్ట్రింగ్ గడ్డర్స్ అమర్చుతున్న దృశ్యం

సొగసు చూడతరమా..!



ర్యాంప్‌పై పోటీపడుతున్న సుందరాంగులు

బరంపురం: నగరంలోని ఇంజినీరింగ్ స్కూల్ క్రీడా మైదాన ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ట్వింకిల్ ఫ్యాషన్ షో గ్రాండ్ ఫైనల్ రసవత్తరంగా సాగింది. బరంపురం మేయర్ సంఘమిత్ర దొళాయి ముఖ్య అతిథిగా పాల్గొని, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులు, కళాకారులు పాల్గొని తమ పాటలు, నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. అనంతరం గంజాం జిల్లా పరిధికి చెందిన యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొని ర్యాంప్‌పై తమ నడకతో హొయలొలికించారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంఘాల



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి, అకాడమీ ప్రతినిధులు



భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో యువతీ, యువకులు

ఐసీడీఎస్ భవనం ప్రారంభం

రాయగడ: జిల్లాలోని రామనగుడలో ఐసీడీఎస్ కార్యాలయ నూతన భవనాన్ని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, బిజూ స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారులు సుధీర్‌దాస్, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి యజ్ఞసేని బెహరా, బీడీఓ ప్రభాతి జొడియా తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన మిషన్‌శక్తి కొత్త భవనాన్ని కూడా గమాంగో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారితకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతున్న మిషన్‌శక్తి రాష్ట్రంలో సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో కూడా మహిళలు వారి ఆర్థిక పురోగతికి కృషి చేయాలని సూచించారు.



ఐసీడీఎస్ భవనాన్ని ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గమాంగో, ఎస్పీ శర్మ, దాస్

గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్

కాశీబుగ్గ: పలాస రైల్వే స్టేషన్ పరిధిలో జీఆర్పీ,ఆర్పీఎఫ్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ ఆధ్వర్యంలో స్టేషన్‌లోని ట్రైన్లలో గంజాయి వంటి మత్తుపదార్థాలకోసం తనిఖీలు నిర్వహించారు. రెండు డిపార్ట్‌మెంట్ల సిబ్బంది పాల్గొన్నారు.



జలుమూరు: ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకువస్తున్న అర్చకులు

మధుకేశ్వరా.. మురిసె వంశధార

మధుకేశ్వరుని రాకతో వంశధార మనోహరమైంది. దేవేరితో కలిసి వచ్చిన ఈశుడిని మనసారా అభిషేకించింది. శుద్ధ పాఢ్యమి పవిత్ర ఘడియల్లో స్వామిని ఆహ్వానించి అర్చించుకుంది. శ్రీముఖలింగంలో త్రిశూల చక్రతీర్థ స్నానాల క్రతువు అంగరంగ వైభవంగా జరిగింది. నంది వాహనంపై ఊరేగుతూ నదికి వచ్చిన స్వామిని వేల మంది భక్తులు తిలకించి పులకించారు.





జన సంద్రం నడుమ వంశధారలో ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం(ఇన్‌సెట్‌లో) నందివాహనంపై పార్వతీపరమేశ్వరులు

- వైభవంగా ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం
- వంశధారకు పోటెత్తిన భక్తజనం

జలుమూరు, ఎల్‌ఎన్ పేట: ప్రఖ్యాత శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు సోమవారం స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానాలు వైభవోపేతంగా జరిగాయి. ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారు. శుద్ధపాఢ్యమి ఘడియలు మధ్యాహ్నం 1.45కు ప్రారంభం కాగా.. అదే సమయంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అర్చకులు, సర్పంచ్ సతీష్ కుమార్, జనార్ధనరావు పంచాది ప్రభాకరరావు, నాయుడు గారి రాజశేఖర్ గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బయటకు తీసుకువచ్చారు. అనంతరం శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి, దేవదాయ శాఖ ఏసీ సూర్యప్రకాష్, డీఎస్పీ శివరామి రెడ్డి టెంకాయలు కొట్టి నంది వాహనంపై మూర్తులను ఉంచి తిరువీధి ప్రారంభించారు. అప్పటికే ఆలయం నలుచెరగులా వేల సంఖ్యలో భక్తజనం వేచి ఉన్నారు. సంప్రదాయం ప్రకారం మిరియాపల్లి రేవుకు స్వామిని తీసుకువెళ్లారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో భక్తుల దర్శనాలు సులభమయ్యాయి. రేవులో కూడా పక్కాగా ఏర్పాట్లు చేయడంతో సజావుగా క్రతువు జరిగింది. చక్రతీర్థ స్నానాలు ముగిశాక మిరియాపల్లి గ్రామస్తులు ఇచ్చిన నూతన వస్త్రాలు, పండ్లు, టెంకాయలతో స్వామికి ప్రత్యేకంగా పూజలు చేశారు. పార్వతీదేవిని మిరియాపల్లి ఆడపడుచుగా భావించి నూతన వస్త్రాలు పెడుతుంటారు. అక్కడ పూజలయ్యాక మళ్లీ నంది వాహనంపైనే ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు పైడి శెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం అందించారు. అలాగే నగిరికటకం, మెట్టపేట యువత, గ్రామ పెద్దలు భక్తులకు అన్నదానం, మజ్జిగ అందించారు.

కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, వైస్ చైర్మన్ లాడి రమేష్ గుప్తా, పాలక వర్గం సభ్యురాలు పి.ధనలక్ష్మీ, తహసీల్దార్ బి.సత్యం, పంచాయతీ విస్తరణాధికారి ఈశ్వరరావు, ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు దండం పెట్టుకుంటున్న చిన్నారులు

క్లుప్తంగా

రెండు ఐటీ యాక్ట్ కేసుల నమోదు

విజయనగరం క్రైమ్: ఐటీయాక్ట్ కింద ఆదివారం రెండు కేసులు నమోదైనట్లు వన్ టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. విజయనగరం వన్‌టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న డాక్టర్ మహేంద్రగిరి భోగాపురంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన మొబైల్‌కి కెవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని లేకపోతే బ్యాంక్ అకౌంట్ ఆగిపోతుందని వచ్చిన మెసెజ్‌కు ఆయన స్పందించారు. లింక్ ఓపెన్ చేయడంతో పాటు ఓటీపీలు ఎంటర్ చేయడంతో ఆయన అకౌంట్ నుంచి రూ.5 లక్షల 25 వేలు నగదు విత్ డ్రా అయింది. దీంతో ఆయన వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే భోగాపురంలో టీచర్‌గా పని చేస్తూ విజయనగరం తోటపాలెంలో నివాసం ఉంటున్న పద్మలతకు బ్యాంక్‌కు సంబంధించిన యాప్ లింక్ పంపించండంతో ఆమె ఓపెన్ చేసి ఓటీపీలను ఎంటర్ చేయడంతో ఆమె అకౌంట్ నుంచి రూ.లక్షా 5వేలు నగదు విత్ డ్రా అయింది. దీంతో ఆమె వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

బలిజిపేట: మండలంలోని అరసాడలో సాలిపేట వద్ద ఉన్న గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఎస్.సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మునాయుడులకు చెందిన గడ్డివాములు దగ్ధం కావడంతో సుమారు రూ.15వేల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దీంతో పశుగ్రాసానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

పుణ్యగిరి జాతర ప్రశాంతం

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరిలో శివరాత్రి సందర్భంగా రెండు రోజులు పాటు నిర్వహించిన జాతర ప్రశాంతంగా ముగిసింది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే అద్భుతం శనిత్రయోదశి వేళ మహాశివరాత్రి, మాసశివరాత్రి కలిసి వచ్చాయి. దీంతో పుణ్యగిరికి భక్తజనం పోటెత్తుతారని అధికార యంత్రాంగం ఆశించినప్పటికీ గత ఏడాది కన్నా ఈ ఏడాది భక్తుల రాక తగ్గింది. భక్తుల తాకిడి తగ్గడానికి కారణం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు సరైన సౌకర్యాలు, వసతులు లేకపోవడమే కారణమని పలువురు చెబుతున్నారు.దేవాదాయశాఖ గణాంకాల ప్రకారం గత ఏడాది 35వేల మంది పుణ్యగిరిని సందర్శిస్తే ఈ ఏడాది 25వేల మంది మాత్రమే వచ్చారు. మొత్తంగా భక్తల రాక తగ్గడంతో ఆర్టీసీ ఆదాయం తగ్గింది. భక్తుల కోసం రెండు రోజుల పాటు నిరంతరాయంగా ఆర్టీసీ సర్వీసులు నిర్వహించింది. పోలీస్‌శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయగా, వైద్యారోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరాలు, పంచాయతీరాజ్ ఉద్యోగులు చలివేంద్రాలు, మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాయి. దేవాదాయశాఖ భక్తులకు దర్శనాలు కల్పించి, ప్రసాదాలు ఏర్పాటు చేసింది. మొత్తంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, అపశృతులు దొర్లకుండా జాతర ముగియడంతో ఆయా శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ దర్యాప్తు



తమ్మయ్యవలసలో దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ మోహన్‌రావు

తెర్లాం: బొబ్బిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి తెర్లాం మండలం తమ్మయ్యవలస గ్రామంలో సోమవారం బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు సోమవారం దర్యాప్తు నిర్వహించారు. బొబ్బిలిలో నివాసముంటున్న తమ్మయ్యవలసకు చెందిన ఓ యువతి తనకు జరిగిన అన్యాయంపై బొబ్బిలి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయగా డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం గ్రామానికి వచ్చి నేరస్థలాన్ని పరిశీలించడంతో పాటు సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. ఆయనతో పాటు బొబ్బిలి టౌన్ ఎస్సై సత్యనారాయణ, తెర్లాం ఎస్సై ఆర్.రమేష్, సిబ్బంది ఉన్నారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, తదితరులు

పార్వతీపురం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నియమావళి అమలుపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలని, ఉల్లంఘనపై ఫిర్యాదువస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

తోటపల్లి పనులు చకచకా

- చురుగ్గా సాగుతున్న పాతఆయకట్టు ఆధునికీకరణ పనులు
- రూ.193కోట్లతో పాత, కుడి ఎడమ కాల్వల అభివృద్ధి
- ఇప్పటివరకు రూ.43 కోట్ల ఖర్చు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఊపందుకున్న పనులు
- మొత్తం ఆయకట్టు: 63 వేల ఎకరాలు
- ఈ ఏడాది జూన్ చివరివారంలో సాగునీరందించేందుకు సన్నాహాలు



వీరఘట్టం మండలం కత్తులకవిటి-హుస్సేనుపురం మధ్యలో జరుగుతున్న ఎడమ కాలువ లైనింగ్ పనులు

వీరఘట్టం:

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరణతో పాటు అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించే పనులను చకచకా పూర్తిచేయిస్తోంది. కాలువలను ఆధునీకరిస్తోంది. రైతన్న సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. దీనికి తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టులో జోరుగా సాగుతున్న పనులే నిదర్శనం.


పనులు వేగవంతం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది. రూ.139 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పనులు అంచనా వ్యయం గతేడాది రూ.193 కోట్లకు చేరడంతో రూ.163 కోట్లు సాంకేతిక అనుమతులతో మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.43కోట్ల విలువైన పనులు పూర్తికాగా

తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనుల వివరాలు	
ఎడమ కాలువ పొడవు	: 37 కి.మీ.
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 16 కి.మీ.
కుడి కాలువ పొడవు	: 20 కి.మీ.
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 12 కి.మీ

ప్రస్తుతం చేపడుతున్న పనులు: పూడికలు తొలగించడం, లైనింగ్ చేయడం, వంతెనలు, స్లూయిజ్‌ల నిర్మాణం

ఆయకట్టు వివరాలు



ఎడమకాలువ పరిధిలోని మండలాలు: జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వీరఘట్టం, పాలకొండ, బూర్జ ఆయకట్టు: 32 వేల ఎకరాలు
కుడికాలువ పరిధిలోని మండలాలు: గరుగుబిల్లి, బలిజిపేట, వంగర ఆయకట్టు: 7,543 ఎకరాలు
ఈ రెండు కాలువల పరిధిలో ఉన్న అదనపు ఆయకట్టు: సుమారు 23,457 ఎకరాలు

బిల్లుల రూపంలో రూ.23 కోట్లను గతేడాది చెల్లించింది. మొత్తం 500కు పైగా పనులు పూర్తిచేయాల్సి ఉంది. కుడి, ఎడమ కాలువలు కలిపి మొత్తం 57 కి.మీ పొడవున విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 26కి.మీ వరకు పనులు పూర్తి చేశారు. కాలువ అడుగు భాగంలో 6 నుంచి 12 మీటర్లు వెడల్పున మట్టితో బైండింగ్ చేయడంతో పాటు అక్కడి నుంచి కాలువ గట్లను లైనింగ్ చేస్తున్నారు. కాలువలకు 200 చోట్ల చిన్న,పెద్ద వంతెనలు నిర్మించడంతో పాటు మరో 300 చోట్ల స్లూయిజ్‌లు, చప్టాలు, డ్రాఫ్ట్ వంతెనలు నిర్మించనున్నారు. ముందుగా లైనింగ్ పనులు పూర్తిచేసి ఆయకట్టు శివారు వరకు సాగునీరు సరఫరా అయ్యేలా పనులు సాగిస్తున్నారు. మొత్తం 63 వేల ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు అందనుంది. రానున్న ఖరీఫ్ నాటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం ఆయకట్టుకు జూన్ చివరి వారంలో సాగునీరు అందించే లక్ష్యంతో పనులు ముమ్మరం చేశారు.

- ఎడమ కాలువలో ఇంత వరకు 14 కి.మీ పరిధిలో కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 21–23 కి.మీ మధ్య ఎం.రాజపురం నుంచి హుస్సేనుపురం వరకు ఎర్త్, లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 23–37 కి.మీల మధ్యలో హుస్సేనుపురం నుంచి పాలకొండ మండలం వెలగవాడ వరకు ఎర్త్, లైనింగ్ పనులు ప్రారంభించారు.
- కుడి కాలువలో 12 కి.మీ కాంక్రీటు పనులు పూర్తి కాగా, 0–4, 16–20 వరకు లెవిలింగ్ పనులను ప్రస్తుతం చేస్తున్నారు. ఇలా ఇంత వరకు రూ.43 కోట్లు విలువ గల పనులు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు.

సకాలంలో నీరు విడుదల



ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది. పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ చివరివారంలో కాలువలకు నీరు విడుదల చేసేందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం ఉండడంతో పనులు వేగవంతంగా పూర్తిచేస్తున్నాం.
– దమలపాటి రవికుమార్, తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల డీఈఈ

ఆర్థిక ప్రణాళిక రూపకల్పనకు గణాంకాలే కీలకం

- కేంద్ర సాంఖ్యాక శాస్త్ర విభాగ అడిషినల్ డైరెక్టర్ జనరల్



సత్కారం పొందుతున్న కేంద్ర సాంఖ్యాక శాస్త్ర విభాగ అడిషినల్ డైరెక్టర్ జనరల్ జీఎస్‌లక్ష్మి

విజయనగరం అర్బన్: సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పలో గణాంకాల పాత్ర కీలకంగా నిలుస్తుందని కేంద్ర సాంఖ్యాక శాస్త్ర విభాగ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జీఎస్.లక్ష్మి అన్నారు. స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో 'అధికారిక గణాంకాలు (అఫిషియల్ స్టేటిస్టిక్స్) అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ అభివృద్ధిలో అధికారిక గణాంకాల ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి ఇలాంటి సదస్సులు నిర్వహించాలని సూచించారు. అవగాహన పెంచడానికి సంబంధిత అంశంపై పోటీలు, చర్చలు విద్యాలయాల్లో నిర్వహించాలన్నారు. జాతీయ గణాంక కార్యాలయాల సేవలను ఉపయోగించుకుని సమాచారాన్ని వినియోగదారులు సేకరించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేల నగదును విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరు కేటగిరిలుగా అందజేశారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి ఎంపీలక్ష్మి, అధ్యాపకులు నరేష్, ఎస్.నవీన్‌కుమార్, డాక్టర్ పీ.గణపతిరావు, డాక్టర్ ఎం.రత్నరాజు, ఎల్.దేవి, ఎన్ఎస్ఎస్ జిల్లా పీఓ జి.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచూపిన గిరిజన విద్యార్థి



విద్యార్థి రంజిత్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

కురుపాం: గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నతపాఠశాల విద్యార్థి ఆరిక రంజిత్ సత్తాచూపాడు. జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. విద్యార్థిని హెచ్‌ఎం కె.అక్కిన, వసతిగృహ సంక్షేమాధికారి ఎం.రాజేంద్రప్రాద్, పీడీలు ఎ.సన్యాసిరావు, పి.బోగేష్ సోమవారం అభినందించారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



విరోతి దేముడు (ఫైల్)

కొత్తవలస రూరల్: మండలంలోని దేశపాత్రునిపాలెం వద్ద సోమవారం జరిగిన రైలు ప్రమాదంలో విరోతి దేముడు (75) అనే వృద్ధుడు మృతి చెందాడు. దేముడు తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు భారతి



ఖోఖో పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం ఆదిలక్ష్మి



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన భారతి

గంట్యాడ: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థిని పాటుపురెడ్డి భారతి ఎంపికైంది. విశాఖపట్నం జిల్లా భీమిలిలో అండర్–14 విభాగంలో ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 17 నుంచి 19వతేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన భారతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే బాలురు ఖోఖో జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా భారతిని, జిల్లా జట్టులో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఇతర ఉపాధ్యాయలు అభినందించారు.

డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్



మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పోజు మధుసూధనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్ కోలా వెంకట హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు మొత్తం 11 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ డబ్బు కోసమే మధుసూధనరావును కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి రూ.11.75 లక్షలు తీసుకోగా... కిడ్నాపర్లలో ఒకరికి డబ్బులు ఇస్తానని చెప్పి, అతడి సహకారంతో కిడ్నాపర్ల చెర నుంచి మధుసూధనరావు తప్పించుకొని ఈ నెల 17వ తేదీన పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు వివరించారు.

ప్రత్యేక బృందాల దర్యాప్తుతో 11 మంది అరెస్ట్

మధుసూధనరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ – 1 సుమిత్ సునీల్ గరుడ కేసును స్వయంగా పర్యవేక్షించారు. 10 బృందాలను ఏర్పాటు చేసి కిడ్నాపర్ల కోసం గాలించారు. మధుసూధనరావు బ్యాంక్ ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాల వివరాలు, ఇతర సాంకేతికతతో కిడ్నాపర్లను పోలీసులు గుర్తించారు. అసలు కిడ్నాపర్ హేమంత్‌కుమార్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి గోవాకు పారిపోయాడు. పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా హేమంత్‌కుమార్‌తోపాటు మొత్తం 11 మంది కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో కోలా హేమంత్‌కుమార్, ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్నా(19), కేడీ పేటకు చెందిన సుర్ల నాగ గణేష్(21), దొండపర్తికి చెందిన దమ్ము శరత్‌తేజ(21), దమ్ము సాగర్ శ్రీనివాస్(22), మన్యం జిల్లాకు చెందిన జెర్రెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన బింపోలు రాంబాబు, వడ్లపూడికి చెందిన గంధవరపు తరుణ్ కుమార్(32), అనకాపల్లికి చెందిన బలిరెడ్డి నానాజీ(25)లను సోమవారం అరెస్ట్ చేశారు. గంధవరపు తరుణ్‌కుమార్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రెండు జతల పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. హేమంత్‌కుమార్‌పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీకాంత్ చెప్పారు. అలాగే కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, రాంబాబుపై కూడా రెండేసి కేసులు ఉన్నట్లు వివరించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



సీతామాంబపురంలో మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ బాలకష్ణ

కొమరాడ: మండలంలోని 31 పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనికల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ వి.బాలకృష్ణ అన్నారు. ఆర్తాం పంచాయతీ సీతామాంబపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పనులకు హాజరైన వేతనదారుల సంఖ్య, మస్టర్లను పరిశీలించారు. మండలంలో ప్రతిరోజు ఐదు వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారన్నారు. పని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



జీసీఎంఎస్ కార్యాలయం ఎదుట నిరసనతెలుపుతున్న గిరిజన సంఘం నేతలు

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులు సేకరిస్తున్న చింతపండు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయం ఎదుట సోమవారం సంఘం నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనులకు ఆర్థికంగా దన్నుగా నిలిచే అటవీ ఉత్పత్తులైన చింతపండును కిలో రూ.50లు చొప్పున, కొండచీపుర్లను ఒక్కొక్కటి రూ.80, జీడిపిక్కలు కిలో రూ.200లు చొప్పున ధర చెల్లించి జీసీసీ అధికారులు సేకరించాలని కోరారు. జీసీసీ అభివృద్ధికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీసీసీ మేనేజర్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

ఏనుగులను కవ్వించొద్దు



చెరుకు తోటలో ఉన్న ఏనుగులు

వీరఘట్టం: ఏనుగుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.హరికృష్ణ సూచించారు. కిమ్మి, నడుకూరు, చిట్టపులివలస పరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, అవి కంటపడితే కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని కోరారు. సోమవారం చిట్టపులివలస సమీపంలోని చెరుకు తోటలో ఏనుగుల గుంపు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని స్థానికులను అప్రమత్తం చేశారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో నవధాన్య సాగుపై శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 10 కేజీల చొప్పున 18 నుంచి 30 రకాల విత్తనాలను తొలకరి వర్షాలకు ముందు పొలంలో వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరగడంతోపాటు భూమి పొరల్లో సేంద్రియ, కర్బన శాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

2024 నాటికి గ్రీన్‌ఫీల్డ్ పూర్తి

- ఆర్డీఓ శైలజ



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శైలజ

మెంటాడ: విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ వరకూ నిర్మాణం జరుపుకుంటున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి 2024 నాటికి పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నామని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె రహదారి పనులను మెంటాడలో పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆరులైన్ల రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. అలాగే మండల కేంద్రంలో రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూ సేకరణతో పాటు నిర్వాసితులకు పరిహారం అందేలా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. స్థానిక రైతులు ఆమెతో ఈ సందర్భంగా మాట్లాడుతూ హైవేకు అవతలి వైపున పొలాలు ఉన్న రైతులకు పంటను గ్రామంలోకి తరలించేందుకు రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగనీయకుండా హైవే కింద భాగంలో రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే స్థానిక గ్రామ పెద్దలు సిరిశెట్టి నారాయణ రావు, గంద్రేటి అప్పలనాయుడు, రాజగోపాల్, రవి తదితరులు హైవే నిర్మాణానికి పరిమితికి మించి మెంటాడ కొండ నుంచి గ్రావెల్‌ను తోడేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ పంచాయతీకి ఎటువంటి రుసుం చెల్లించకుండా గ్రావెల్‌ను రవాణా చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుల ఫిర్యాదులు విన్న ఆర్డీఓ మాట్లాడుతూ హైవే సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో తహసీల్దార్ ఆదిబాబు, స్థానిక సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, భాస్కర్ (వెనుక ముసుగులో నిందితులు)



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ఫక్రుద్దీన్

విజయనగరం క్రైమ్: విధులు నిర్వహించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సైలు అశోక్‌కుమార్, భాస్కరరావులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.
విధులు పూర్తిచేసుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పీవీఆర్ ఆస్పత్రి రోడ్డులో వెళ్తున్న దిలీప్ కుమార్‌పై ఈ నెల 17న రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు దాడి చేసి అతని వద్ద ఉన్న పర్స్, డబ్బులు సెల్‌ఫోన్ లాక్కున్నారు. అది గమనించిన వెంకటర్రావు అనే వ్యక్తి వారి నుంచి దిలీప్‌ను కాపాడేందుకు ప్రయతిస్తే అతన్ని కూడా కొట్టి సెల్, డబ్బులు పట్టుకుని పరారయ్యారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు నిందితులు అల్లు సాగర్, చండీభానుకిశోర్‌లను అరెస్టు చేసి, వారి నుంచి పర్స్, సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితులను ఇప్పటికే గంజాయి కేసులో రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో ఇద్దరు..

పార్వతీపురంటౌన్: గత సంవత్సరం అక్టోబర్ నెల 18న పార్వతీపురం పట్టణంలోని సారిక వీధిలో జరిగిన దొంగతనం కేసులో సోమవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఇందిరా కాలనీ వాసులు సొండి శ్రీధర్, స్నేహితుడు దేవుపల్లి నవీన్ మరో వ్యక్తి కలిసి అక్టోబర్ 10వ తేది రాత్రి వారాల పండగ పూర్తయిన తరువాత షేక్ రఫీ అనే వ్యక్తి ఇంటికి సరిగా తాళాలు వేయకుండా నిద్రిస్తున్న విషయం గమనించి ఇంట్లో చొరబడి, బంగారు వస్తువులు, డబ్బు ఒక సెల్‌ఫోన్ దోచుకుని పరారయ్యారు. సీసీఎస్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం ఆధారంగా, టౌన్ పోలీసులు నిందితులిద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తు రెండు బంగారు ఉంగరాలు, చెవి దుద్దులు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మూడవ వ్యక్తిని, మరికొంత చోరీ సొత్తు గురించి పోలీసులు గాలిస్తున్నారు.